# కుంటలు నిండుగా.. పంటలు పచ్చగా

- మానకొండూర్ నియోజకవర్గం సస్యశ్యామలం
- నెరవేరిన ప్రభుత్వ ఆశయం
- అన్నదాతల్లో ఆనందం



రామకృష్ణకాలనీ శివారులో వరిపంట

నిలువునా ఎండిన చెట్లు.. నెర్రలు చూపిన భూములు.. ఇవీ మానకొండూర్ నియోజకవర్గంలో ఒకప్పటి వ్యవసాయ రంగ పరిస్థితులు. కానీ నేడు ఈ పరిస్థితిలో పూర్తిగా మార్పు వచ్చింది. నిండు కుండను తలపించే కుంటలు.. పచ్చని పంట పొలాలతో గ్రామాలు కళకళలాడుతున్నాయి. ప్రభుత్వ ఆశయం మేరకు నియోజకవర్గం సస్యశ్యామలం కావడంతో అన్నదాతల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

**- తిమ్మాపూర్, అక్టోబర్ 28**

మానకొండూర్ నియోజకవర్గంలో మానకొండూర్, గన్నేరువరం, శంకరపట్నం, తిమ్మాపూర్, బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో 634 కుంటలు ఉన్నాయి. గత యాసంగి ఎండల్లో సైతం 370వరకు కుంటలను అధికారులు నింపారు. మిగిలిన కుంటలు అర్బనైజేషన్ వల్ల, కాలువలు తీయడానికి సమీప రైతులు ఒప్పుకోకపోవడం వల్ల నీటితో నింపాలనే ఆలోచనను విమరించుకున్నారు. మిడ్ మానేరు కుడికాలువ నుంచి తోటపల్లి ద్వారా జనవరిలో ప్రారంభమైన నీటివిడుదల ఏప్రిల్ చివరిదాక కొనసాగించి కుంటలు, వరి పంటలకు పారకం అందించారు.

### మిషన్ కాకతీయతో కట్టలు పటిష్టం..

పూర్వకాలంలో తవ్విన కుంటలు, చెరువుల కట్టలు శిథిలావస్థకు చేరుకోగా, మిషన్‌కాకతీయ పథకంలో వాటిని పటిష్టం చేశారు. 'కాళేశ్వరం' నీళ్లు రాకముందే ముందస్తుగా నాలుగు విడతల్లో 321చెరువులను రూ.51కోట్లతో పునరుద్ధరించారు. దీంతో తెలంగాణ ప్రభుత్వానికి ముందు 10మీటర్లలో ఉన్న భూగర్భ జలమట్టం అమాంతం 5 మీటర్లకు పెరిగింది.



మన్నెంపల్లిలో మత్తడి దుంకుతున్న పెద్దచెరువు కుంట (ఫైల్)

### కాలువల అనుసంధానం పూర్తికాకున్నా..

కాళేశ్వరం ప్రాజెక్టు నీరు మానకొండూర్ నియోజకవర్గానికి ఎంతగానో ఉపయోగపడుతున్నది. శ్రీ రాజరాజేశ్వర జలాశయం నుంచి ఎల్ఎండీకి, ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ ప్రాజెక్టు, కుడికాలువ ద్వారా తోటపల్లి రిజర్వాయర్ నుంచి మొత్తంగా నియోజకవర్గంలో సుమారు 90వేల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరందుతున్నది. కేవలం కాలువలే కాకుండా అన్నపూర్ణ జలాశయం ద్వారా ఇల్లంతకుంట, బెజ్జంకి మండలాల్లో 25చెరువులు నిండుకుండల్లా మారాయి. దీంతో రెండు మండలాల్లో భూగర్భజలమట్టం పెరిగి కాలువల అనుసంధానం పూర్తికాకున్నా కూడా బావులు, బోర్లలో పుష్కలంగా నీళ్లుండడంతో రైతులు రెండు పంటలను సంతోషంగా పండించుకుంటున్నారు.

### పెరిగిన సాగు..

గతంతో పోలిస్తే వరిసాగు విపరీతంగా పెరిగింది. కుడికాలువ నుంచి డిస్ట్రిబ్యూటరీ, లింక్ కాలువల ద్వారా కుంటలను నింపడం వల్ల భూగర్భ జలాలు పెరిగాయి. కుంటల పరిధిలోని బావులు నిండుగా మారి రైతులకు ఎద్దడి అనేదే లేకుండాపోయింది. కుంటలు నింపడంతో వందల ఎకరాల పొలాలకు బావులు, బోర్ల ద్వారా నీరందుతున్నది. నియోజకవర్గంలో కాకతీయ కాలువ వెళ్తున్న తిమ్మాపూర్‌లోని కొన్ని గ్రామాలు, మానకొండూర్‌లోని కొన్ని గ్రామాలు, శంకరపట్నంలోని కొన్ని గ్రామాలకు తప్ప నీటి సౌకర్యం ఉండేది. మిగతా ప్రాంతాల్లో ఒక్క పంట మాత్రమే ఆధారం ఉండేది. కానీ పక్కా ప్రణాళికతో కాళేశ్వరం జలాలను అందిస్తుండడంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఒకప్పుడు ఒకే పంట పండే భూములన్నీ నేడు రెండు పంటలకు అనుకూలంగా మారాయి.

### కాలువలే ప్రధానం

నియోజకవర్గం సస్యశ్యామలం కావడానికి ముఖ్య కారణం కాలువలే. శ్రీ రాజరాజేశ్వర జలాశయం, ఇల్లంతకుంటలోని అనంతగిరి శివారులో గల అన్నపూర్ణ జలాశయం నుంచి ఇల్లంతకుంట, బెజ్జంకి మండలాల్లోని కుంటలను నింపారు. అలాగే కుడికాలువ ద్వారా అత్యంత కరువు పరిస్థితుల్లో ఉన్న గన్నేరువరం మండలానికి, తిమ్మాపూర్‌లోని 15గ్రామాలకు కాలువల ద్వారా సాగునీరు అందిస్తున్నారు. దీనికి తోడు ఎల్ఎండీ రిజర్వాయర్‌లో ఎల్లవేళలా 20టీఎంసీల నీళ్లు ఉంచుతుండడంతో డ్యాం పరిసర గ్రామాల్లో భూగర్భజలమట్టం పెరిగింది. దీంతో ఆయా గ్రామాలు పంటలతో కళకళలాడుతున్నాయి.

### దూరమైన కరువు..

గతంలో ఎండాకాలం వచ్చేముందే భూగర్భ జలాలు అడుగంటి పోయేవి. దీంతో వరిపొలాలు పెద్ద మొత్తంలోఎండిపోయేవి. రైతులు తీవ్రంగా నిరాశకు గురయ్యేవారు. పెట్టుబడులు పెట్టి నష్టపోయేవారు. ఎండిపోయిన వరిపొలాలు పశువుల మేతగా మారేవి. కానీ ప్రస్తుతం పరిస్థితి మారింది. కాలువల ద్వారా నీళ్లు అందుతుండడంతో మండలంలో కరువు దూరమైంది. తెలంగాణ ప్రభుత్వం రైతులపై ప్రత్యేక దృష్టి సారించడంతో క్షేత్రస్థాయిలో రైతులకు మేలు జరుగుతున్నది. తెలంగాణ రాక ముందు నియోజకవర్గంలో రెండు లక్షల టన్నుల దిగుబడి ఉండగా.. ప్రస్తుతం మూడు లక్షల పైచిలుకు దిగుబడి వస్తున్నది

# కారు గుర్తుకు ఓటేసి గెలిపించండి

- ఎమ్మెల్యే రసమయికి మద్దతుగా బీఆర్ఎస్ శ్రేణుల విస్తృత ప్రచారం



శంకరపట్నం: కాచాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ రాజయ్య, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



గద్దపాకలో డాక్టర్ రసమయి బాలకిషన్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైస్ ఎంపీపీ రమేశ్ తదితరులు

శంకరపట్నం, అక్టోబర్ 28: మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పార్టీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ తరపున విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గద్దపాక, కాచాపూర్, మొలంగూర్, ఇప్పలపల్లి, మక్త, కొత్తగట్టు, ఎరడపల్లి తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో ఇంటింటి ప్రచారంలో భాగంగా ఓటర్ల వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. ఓటర్లు తమ ఓటును కారు గుర్తుకు వేసి మరోసారి ఎమ్మెల్యేగా డాక్టర్ రసమయి బాలకిషన్‌కు పట్టం కట్టాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఓటు వేసే విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. బీఆర్ఎస్ కరపత్రాలు పంచి పెట్టారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంట మహిపాల్, వైస్ ఎంపీపీ పులికోట రమేశ్, సర్పంచులు గోపు విజయ్ కుమార్‌రెడ్డి, కొండ్ర రాజయ్య, బైరి సంపత్, మొకిరాల కిషన్‌రావు, రంజిత్‌రావు, మొయిన్, సంపత్, తిరుపతి, సింగిల్‌విండో చైర్మన్ తిరుపతిరెడ్డి, ఉప సర్పంచులు మల్లరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గజెల్లి హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్, అక్టోబర్ 28: మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. రామకృష్ణకాలనీలో గ్రామ ఇన్‌చార్జి తుమ్మనపల్లి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో శనివారం ఉదయమే పార్టీ ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలోని అంశాలను వివరించారు. సీఎంగా కేసీఆర్ ఉండాలంటే కారుగుర్తుపై ఓటేయాలని సూచించారు. ఎమ్మెల్యే అభ్యర్థి రసమయి బాలకిషన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మీసాల అంజయ్య, ఎంపీటీసీ కిన్నెర సుజాతా సారయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రసమయి భారీ మెజార్టీతో గెలవాలని పూజలు



ఇందిరానగర్‌లో సాయిబాబా ఆలయంలో పూజ చేస్తున్న నాయకులు

తిమ్మాపూర్ రూరల్, అక్టోబర్ 28: ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్ మరోసారి భారీ మెజార్టీతో విజయం సాధించాలని మండలంలోని ఇందిరానగర్‌లోని సాయిబాబా ఆలయంలో శనివారం బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటా తిరుగుతూ కారు గుర్తుపై ఓటు వేసి విజయభేరి మోగించాలని కోరారు. ప్రచారం నిర్వహణపై బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రావుల రమేశ్ స్థానిక నాయకులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కాటిక వినోద, ఎంపీటీసీ కొత్త తిరుపతిరెడ్డి, ఉప సర్పంచ్ అనురాధ కుమార్, గ్రామ ఇన్‌చార్జి బోయిని తిరుపతి, గ్రామాధ్యక్షుడు రామ్ కిషన్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల విద్యా ప్రగతికి తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరం



విద్యార్థులకు డైరీలను అందజేస్తున్న డీఈవో

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 28: పిల్లల విద్యా ప్రగతికి తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరమని జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు సూచించారు. మానకొండూర్ మండలం అన్నారం జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయుడు ఎన్ సుదర్శన్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి మండల విద్యాధికారి ఎం మధుసూధనాచారితో కలిసి డీఈవో హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ, విద్యార్థులు చక్కటి విద్యనభ్యసించాలంటే ఉపాధ్యాయుల కృషి ఒక్కటి మాత్రమే సరిపోదని, దానికి తోడు తల్లి దండ్రులు విద్యార్థుల చదువుపై శ్రద్ధ వహించాలని సూచించారు. తరచూ ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఉండాలన్నారు. విద్యార్థుల ఫలితాలు ఎలా ఉంటున్నాయో వివరించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం బ్రేక్ ఫాస్ట్‌ను అందించే కార్యక్రమాన్ని చేపట్టిందని గుర్తు చేశారు. ప్రస్తుతం జాతీయ స్థాయిలో ప్రతి విద్యార్థికీ ఒక యూనిక్ ఐడీని ప్రభుత్వం కేటాయిస్తున్నదన్నారు. అనంతరం విద్యార్థులకు డైరీలతో పాటు ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసే విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 28: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఊటూర్ సొసైటీ సీఈవో మిట్టపల్లి రవీందర్ సూచించారు. మానకొండూర్ మండలం ఊటూర్ సొసైటీ పరిధిలోని వేగురుపల్లి, ఊటూర్ గ్రామాల్లో శనివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సీఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు ధాన్యాన్ని తాలు, తేమ లేకుండా తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది, ఆయా గ్రామాల రైతుల పాల్గొన్నారు.

## అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

తిమ్మాపూర్, అక్టోబర్28: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా మద్యం అమ్మకాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ శాఖ తిమ్మాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్, మానకొండూర్, చిగురుమామిడి, గన్నేరువరం మండలాల్లో తనిఖీలు నిర్వహించి 9లీటర్ల నాటుసార, 152 లీటర్ల మద్యం, 300 గ్రాముల గంజాయి పట్టుకున్నట్టు పేర్కొన్నారు. ఆయా కేసుల్లో 11 మందిని అరెస్టు చేశామని, 55 కేసులు నమోదు చేశామని, ఒక వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో మద్యం, నాటుసార, బెల్లం, గంజాయి అమ్మకాలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 108 మందిని ఆయా మండలాల్లోని తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. మద్యం దుకాణాలను నిబంధనలకు లోబడి నడపాలని సూచించారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం అమ్మకాలు, రవాణా జరిగితే 8712658810 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

## బంగారం స్వాధీనం

తిమ్మాపూర్, అక్టోబర్28: ఎన్నికల నేపథ్యంలో రేణికుంటలో ఏర్పాటుచేసిన చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలో ఆధారాలు లేకుండా తరలిస్తున్న 150 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎల్ఎండీ ఎస్ఐ ప్రమోద్ రెడ్డి తెలిపారు. కరీంనగర్‌కు చెందిన తనుకు సందీప్ అనే వ్యక్తి కారులో ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా తరలిస్తుండగా, ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఆభరణాలను సంబంధిత అధికారులకు అప్పగించినట్లు చెప్పారు.